# నిలువు దోపిడి

'ఓ మూల ఆఫీసుకి టైమవుతోంది. ఈవిడ ఓ పట్టాన ఆ పూజ గదిలోంచి బయట పడదు.' వెంకట్రావు అసహనం అతని ముఖం లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చేతిలో పేపరు చిరాగ్గా టీపాయి మీదికి విసిరికొట్టాడు. పూజ గదిలోంచి భార్య చదువుతున్న లలితా సహస్రం ఆగింది. గంటమోత వినగానే 'హమ్మయ్య! హారతిలోకి వచ్చినట్టుంది' అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

"ఏమోయ్! నాలుగు మెతుకులు పడేస్తే నేనాఫీసుకు వెళ్ళాలి!" అన్నాడు చిరాగ్గా.

"ఆః! అయిపోయింది. వస్తున్నా" అంటూ నే హారతి తెచ్చి అతనిముందు నిల్చుంది శారద.

ఆమెవంక కోపంగా చూస్తూ అలా ఉండి పోయాడు వెంకట్రావు.

"ఏవిటాచూపు? హారతి కళ్ళకద్దుకోండి!!" అంది. వెంకట్రావు కళ్ళ కద్దుకున్నాడు. శారద తిరిగి పూజగదిలోకి వెళ్ళబోయింది.

"శారదా!" పిల్చాడు వెంకట్రావు. అక్కణ్ణిం చే శారద వెనక్కి తిరిగి చూసింది.

"ఇన్నాళ్ళనుంచి పూజలు చేస్తున్నావుకదా ఏం ఒరిగిందంటావ్? గంటలు గంటలు ఆ పూజగదిలో గంటలు వాయిస్తూనే ఉంటావు. అసలా దేవుడికి వినిపిస్తున్నాయంటావా?"

"ఏవిటండీ ఆమాటలు" అతని మాట తీరు ఆమెకు తెలిసినా సరిపెట్టుకోలేకపోయింది.

"రోజూ మామీద సంధించే మీ మాటల తూటాలు సరాసరి దేవుడి మీదే వేస్తున్నారా ఇవాళ? దేవుడికి కోపమొస్తుందండీ!" అంది.

"వస్తే రానీయ్! నాకేం ఒరగబెట్టినట్టు. ఆరే ళ్ళనించి నాకు రావాల్సిన ప్రమోషన్ ఇప్పించా డా?"

"మనస్ఫూర్తిగా కోరుకుంటే మన ఇలవేల్పు తప్పక ఇప్పిస్తాడు."

"అయితే ఇన్నేళ్ళనించీ నా ప్రమోషన్ గురించి అడగనే లేదా"

అతని మాటలకి ఒకపక్క కోపం, ఒకపక్క నవ్వు వచ్చాయి. నవ్వాపుకుంటూ అంది.

"మీ ప్రమోషన్ గురించి నేనడగడమేమి టండీ! రోజూ పొద్దున్నే ఆ పేపరు తిరగేస్తూ గంటల తరబడి కూర్చోకపోతే, ఓ పూజా, పున స్కారం చేసి, భగవంతుణ్ణి ఆరాధించి అడిగితే అన్నీ యిస్తాడు."

ఆమెకు తెలుసు అతనికి పూజలు, దేవుడు అంటే నమ్మకం అంతంత మాత్రం అని. అయి నా, సందర్భం వచ్చింది కనక ఓమాట విసి రింది.

"నాకు తెలుసు నువ్వా మాట అంటావని. అయినా నిన్నని ప్రయోజనం ఏవిటిలే. నీ దేవు ణ్ణి..." ఇంకా ఏదో అనబోయాడు– ఆవేశంగా వెనక్కొచ్చింది శారద.

"దేవుణ్ణి ఒక్క మాట అంటే నేనూరుకోను" అంది కోపంగా.

ఆమె కోపంతో చూసిన చూపుల వేడి చురు

**పుష్యమి**

క్కున తగిలిందతనికి.

"ఒకే! ఓకే!... దేవుడు ఉన్నాడే అనుకొం దాం. మనకి అడిగింది ఇవ్వాలి కదా"

"మనకి అనకండి. ఆయన లిస్టులో మీరు లేరు." కరాఖండీగా చెప్పింది శారద.

"ఏం? ఎందుకని" అమాయకంగా అడిగా డు వెంకట్రావు.

"మీరాయన్ని నమ్మి, పూజించి, మొక్కి అడి గితే కదా ఇస్తాడో లేదో తెలిసేది." భర్తకి తన మాటలు చెవికెక్కవని ఆమెకు తెలుసు.

కానీ, ఆమె అంచనా తారుమారయింది. "ప్రమోషన్ ఇప్పిస్తాడంటుంటే ఒక్కసారి నమ్మితే ఏం?" అనుకున్నాడో ఏమో-

"సరేనోయ్! ఇవాళ నిజంగా నీమాట నమ్ము తున్నాను. దేవుణ్ణి నమ్ముతున్నాను. కానీ పూజ లూ అవీ..." నసిగాడు కొంచెం ఇబ్బందిగా వెంకట్రావు.

శారద ముఖం మీద చిరుదరహాసం విరి



సింది. భర్తలో కొంచెం మార్పు గమనించింది. 'ఈ అవకాశాన్ని వదులుకోకూడదు. ఈయనను మార్చాలి.' అనుకుంది.

మెల్లిగా అంది-

"పూజలూ అవీ వద్దుగానీ ఆ ఏడుకొండలవాడిని మనసులో తలచుకుని మొక్కుకోండి. ప్రమోషన్ ఆయనే ఇప్పిస్తాడు." గలగలా నవ్వుతూ హారతి పూజగదిలో పెట్టి, అతనికి భోజనం వడ్డించే పనిలోకి వెళ్ళిపోయింది.

వెంకట్రావు కళ్ళు మూసుకున్నాడు!...

వడ్డన పూర్తయి పిలిచింది శారద-

"కళ్ళు మూసుకుని జపం చేస్తున్నారేమిటి? భోజనానికి రండి!" నవ్వుతూ అంది.

వెంకట్రావు సీరియస్‌గా తీసుకున్న ఈ విషయాన్ని భార్యకు చెప్పాలనుకున్నాడు. విని, శారద నవ్వుతుందని అతనికి తెలుసు.

"నిజంగా నువ్వు చెప్పినట్లు మొక్కుకున్నాను శారదా."

"ఏవిటీ! మొక్కుకున్నారా"

"అవును. నిజంగా"

"ఖర్చులేని మొక్కు ఏదో మొక్కుకుని ఉంటారు." నమ్మకం కుదరలేదన్నట్లు ఉందామె మాట.

"లేదు శారదా! ప్రమోషన్ వస్తే నిలువుదోపిడీ ఇప్పిస్తానని మొక్కుకున్నాను" అన్నాడు ఆమె మెచ్చుకుంటుందన్న నమ్మకంతో.

శారద ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏవిటీ! నిలువుదోపిడీయే!" అంది నోరు వెళ్ళబెట్టి.

అంతలోనే ఏదో అనుమానమొచ్చి-

"నిలువుదోపిడీ ఇప్పిస్తానని మొక్కుకున్నారా?... ఎవరిచేత ఇప్పిస్తారు?" అడిగింది అర్థం కాక.

"ఎవరిచేతో ఎందుకిప్పిస్తాను. నీ చేతే ఇప్పిస్తానని మొక్కుకున్నాను." ఏదో ఘనకార్యం చేసినవాడిలా మొహంపెట్టి అన్నాడు.

శారద నమ్మింది!... కానీ 'తన వైఖరికి విరుద్ధంగా... అదీ, అంత ఖర్చుతో కూడిన మొక్కు వెంకట్రావు మొక్కి ఉంటాడా?' అని ఓ అనుమానం మనసులో ఓమూల...

'ఇందులో తిరకాసు లేదు కదా!... ఏమో! నిజంగా ఆయన మారి... మొక్కు చెల్లించి... ప్రమోషన్ వస్తే అంతకన్నా కావలసిందే ముంది.' అనుకుంటూ భోజనం వడ్డించింది. పక్కనే కూర్చుని విసురుతూ 'ఎంత మారిపోయారండీ మీరు!' అని లోపలే అనుకుంటూ తృప్తిగా నవ్వుకుంది.

ఆరోజు ఓగంట ముందే ఇంటికొచ్చేశాడు వెంకట్రావు!-

ఆ నడక... ఆ హడావిడి... ఆ చిరునవ్వు... ఆ ఠీవి... చూసి అంతదూరాన్నించే ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది శారద.

"ఏవిటలా ఆశ్చర్యపోతున్నావు? ఈ గుమస్తా వెంకట్రావుకి ఇన్ని హోయలు ఎలా వచ్చాయనా?... ఇప్పుడు నీ మొగుడు జిల్లా అధికారోయ్!" భుజాలు ఎగరేస్తూ ఆనందంగా చెప్పాడు వెంకట్రావు.


ఆమెకి అర్థమైపోయింది!...

"మీకు ప్రమోషన్ వచ్చిందని మీ మొహం చూస్తేనే తెలుస్తోంది!" అంది ఆనందంగా.

"ఇంకా ఏం తెలుస్తోందో చెప్పు" అడిగాడు కొంటెగా చూస్తూ.

"ఇంకానా?..." అర్థం కాలేదామెకు.

"రేపు శుక్రవారం తిరుపతి ప్రయాణం"




నమ్మలేకపోయింది శారద. భర్తలో ఎంత మార్పు. నమ్ముకుని వెంకన్నబాబుకు మొక్కుకోవడం... వారం తిరక్కుండా ప్రమోషన్ రావడం... మరుసటి వారం తిరుపతి యాత్ర!...

నమ్మక తప్పలేదు శారదకు. ప్రమోషన్ ఆర్డర్, తిరుపతి రిజర్వేషన్ టిక్కెట్లు చూసి ఆశ్చర్యపోయింది.

ఆరోజు రాత్రే తిరుపతి ప్రయాణం!... అన్నీ సర్దుకుంటోంది శారద.

వెంకట్రావు టేబుల్ దగ్గర కూర్చుని ఏదో లిస్టు రాస్తున్నాడు. దగ్గరకొస్తూ అడిగింది-

'ఏమిటి రాస్తున్నారు? నిలువు దోపిడీకి హుండీలో వెయ్యాల్సిన నగల లిస్టా' అది.

"ఏమీలేదు. ఇల్లు తాళం వేసి వెడుతున్నాం కదా, ప్రతి గదికీ ఒక్కొక్క తాళం వేస్తాను. ఆ తాళం ఒక చోట పెడతాను ఇవతల గదిలో... మర్చిపోతామేమోనని ఆ వివరాలు రాసుకుంటున్నా!" అన్నాడు తానేదో తెలివిగా చేస్తున్నట్లు మొహం పెట్టి.

"శారదా!" పిల్చాడు.

"ఏంలేదు. రైలు ప్రయాణం కదా! ఆ మెళ్ళోవన్నీతీసి బీరువాలో లోపల లాకర్ అరలో పెట్టు. చేతి ఉంగరం- మెళ్ళో చిన్న గొలుసు తప్ప మిగిలిన నగలన్నీ తీసి ఇంట్లో జాగ్రత్త చెయ్యి. ప్రయాణంలో దొంగల భయం కదా!" అన్నాడు.

"అది కాదండీ!..." ఏదో చెప్పబోయింది శారద.

"శారదా! చెప్పింది చెయ్యి. ఇంట్లోనే సేఫ్! అన్ని గదులకీ ఇన్ని తాళాలు వేస్తున్నా కదా!"

"మరి నిలువుదోపిడీ?..."

"అప్పటికి నీ ఒంటి మీద ఏవి ఉంటే అవన్నీ హుండీలో వేస్తావు కదా!" పెద్ద తెలివైన నిర్ణయం తీసుకున్నట్లు అన్నాడు.

ఇంకా ఏదో చెప్పాలనుకుంది శారద. కానీ, అతడు వినడని ఆమెకు తెలుసు. మౌనంగా వెనుతిరిగింది.

# ఓ సరదా చిత్రం!




తిరుపతి యాత్ర పూర్తిచేసుకుని ఇంటికి తిరిగొచ్చిన వెంకట్రావుకి బార్లా తీసి ఉన్న తలుపులు స్వాగతం పలికాయి. రిక్షా దిగుతూనే అది చూసి అవాక్కయింది శారద! – లబోదిబో మంటూ లోపలికి పరిగెత్తారు. ఏముంది!... కొంపమునిగింది. సామాన్లన్నీ చిందర వందరగా ఉన్నాయి. పడగ్గదిలోకి పరిగెత్తాడు వెంకట్రావు. బీరువా తలుపులు బార్లాతీసి ఉన్నాయి! లోపలంతా ఖాళీ! మొత్తం నగలన్నీ దోచుకుపోయారు.

కిందపడి ఉన్న ఓ కాగితం కనిపించింది. తీసి చూశాడు. ఆ కాగితం వెక్కిరిస్తూ నవ్వినట్టనిపించిందతనికి. తలపట్టుకుని కూలబడ్డాడు!... అతని చేతిలో కాగితం తీసుకుని చూసింది శారద. అన్ని గదులకీ వేసిన తాళాలు... ఏది ఎక్కడ దాచాడో సవివరంగా రాసిన లిస్టు!... రాసిన కాగితం జేబులో పెట్టుకోవడం మర్చిపోయాడు వెంకట్రావు!... టేబుల్ మీదే, హాలులో మర్చిపోయాడు.

"ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఇలా జరిగిందేవిటి శారదా?" అమాయకంగా అన్నాడు వెంకట్రావు.

శారదకు అరికాలు మంట నెత్తికెక్కింది! ఊగిపోయింది కోపంతో–

"ఎలా జరిగింది? జరగాల్సిందే జరిగింది. దేవుడితో పరాచికాలా!... ఆ వెంకన్నబాబునే మోసం చేయాలనుకుంటే ఏం జరుగుతుందో అదే జరిగింది.

నిలువుదోపిడీ ఇస్తానని మొక్కుకున్నారు. నిలువునా దేవుణ్ణి మోసం చేశారు. అందుకే ఇలా జరిగింది. అన్నీ వడ్డీతో సహా ఆయనే లాక్కున్నాడు. ఇంట్లోనే నిలువునా దోపిడీ అయింది! అందుకేనండీ అంటారు... మాట మీద నిలబడాలని..." ఇంకా ఏదేదో ఆమె అంటూండగానే వెక్కివెక్కి ఏడ్చాడు వెంకట్రావు!... ఎందుకు?... దేవుణ్ణి మోసం చేసినందుకా?... ఏమో!... సొమ్ము పోయినందుక్కూడా కావచ్చుగా!... ●